క్లుప్తంగా

ఆరోగ్య జిల్లా కోసం కృషి

వనపర్తి: జిల్లాలో ఆరోగ్యవంతులైన యువతను తయారు చేసేందుకు రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన చిన్న పిల్లల హృదయ వ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి సందర్శించారు. ఆర్‌బీఎస్‌కే, ఎన్‌యండీసీ సౌజన్యంతో హృదయ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. స్టార్ హాస్పిటల్ పిడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డా. సుమన్ బ్యాస్ వైద్య పరీక్షలు చేశారు. మొత్తం 84 మంది చిన్నారులను పరీక్షించగా (11) మంది చిన్నారులకు శస్త్ర చికిత్సలు అవసరం కాగా, మరో 13 మంది చిన్నారులకు వైద్య సేవలు అవసరమని డాక్టర్లు తెలిపారు. శస్త్ర చికిత్సలు సైతం ఆరోగ్య శ్రీ పథకంలో హైదరాబాద్‌లో ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

4న బొడ్రాయి ప్రతిష్ఠ వార్షికోత్సవ పూజ

అమరచింత: పట్టణంలో నవంబర్ 4న బొడ్రాయి ప్రతిష్ఠాపన వార్షికోత్సవ పూజ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు నాగభూషణంగౌడ్, తాటికొండ రమేష్, కృష్ణమూర్తిలు తెలిపారు. పట్టణంలోని మార్కండేయ ఆలయంలో శనివారం సమావేశం నిర్వహించి పూజ కార్యక్రమాల తేదీలను నిర్ణయించారు.

హామీలను అమలు చేయండి

అమరచింత: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అలసత్వం చూపుతోందని ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం మండల తహసీల్దార్ కారాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా, పంటల బీమా, రైతుబీమా పథకాలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి అమలు చేయాలన్నారు. రైతులకు అవసరమైన పంటరుణాలను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాస్‌లైన్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాజు, కురుమన్న, మనివర్ధన్, బాలస్వామి, వెంకటయ్య పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

అమరచింత: ధర్మాపురంలో శనివారం పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. మండలంలోని పాడిపశువుల వివరాలను సేకరించడంతో పాటు వారి సంరక్షకులను కలిసి గాలికుంటు వ్యాధి వల్ల పశువులకు కలిగే అనార్థాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మస్తీపురంలో మొత్తంగా 255 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అటెండర్ వహీద్, గోపాల మిత్ర రాంచందర్ పాల్గొన్నారు.

మురుగు తొలగించాలి

అమరచింత: జామీయ మసీదు వెనక వ్యవసాయ పొలంలో మురుగు చేరి పరిసరాలు దుర్గంధంగా మారాయని, దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ తెలిపారు. ఎన్నో పర్యాయాలు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు ఇస్తున్నా నిల్వ ఉన్న మురుగును తొలగించడం లేదన్నారు. రెండెకరాల వ్యవసాయ పొలం మురుగు వల్ల పంటకు పనికి రాని పరిస్థితి ఏర్పడిందన్నారు.

రోగ నిరోధక శక్తి పెంపే లక్ష్యం

- గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు
- నవంబర్ 14 వరకు కొనసాగనున్న క్యాంపు



పాన్‌గల్ పశువైద్యశాల



గాలికుంటు నివారణ టీకాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల పశువైద్యాధికారి(ఫైల్)

పాన్‌గల్: గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం పశువుల్లో రోగ నిరోధక శక్తిని పెంచేందుకు టీకాలు వేయడం ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న ఎఫ్‌ఎండీ ప్రోగ్రాం కింద ఈ టీకాలను ప్రతి ఆరు నెలలకోసారి వేసి, రాబోయే నాలుగేళ్లలో గాలికుంటు వ్యాధిని పూర్తిగా నివారించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. వచ్చే నెల 14వ తేదీ వరకు టీకాల పంపిణీ కొనసాగనుంది. మండలంలోని అన్ని గ్రామాల్లో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ వ్యాధి క్రిములు గాలితో ప్రయాణించి ఇతర పశువులకు సోకే అవకాశం ఉంది.

మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో 10 వేల పశువులున్నాయి. టీకాలు వేసిన పశువులకు గుర్తుగా కొమ్ములకు ఆకుపచ్చ రంగు వేస్తారు. ఉదయం వేళ చల్లటి సమయంలోనే టీకాలు వేసే కార్యక్రమం చేపడతారు. అధికారులు ముందు రోజు పల్లెల్లో టాం టాం వేయించి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పశువైద్యులు, సిబ్బంది ప్రతి రైతు వద్దకు వెళ్లాల్సి ఉంది. అందుబాటులో లేకపోతే మరో 10 రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నారు.

టీకాలపై అవగాహన పెంచాలి..



పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు అందిస్తున్న టీకాలపై గ్రామాల్లో చాలా మంది రైతులకు అవగాహన లేక పశువులకు టీకాలు వేయించుకోవడం లేదు. టీకాలు వేస్తున్న విషయం ముందుగానే గ్రామంలో చాటింపు వేయిస్తే రైతులు అందుబాటులో ఉంటూ తమ పశువులకు టీకాలు వేయించుకుంటారు. – నర్సింహ నాయుడు, రైతు, మాధరావుపల్లి

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



అన్ని రకాల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు కొనసాగిస్తాం. గ్రామాల్లో పశువులు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గ్రామాల్లో టీకాలు వేసే విషయం ముందుగానే ఆ గ్రామంలో చాటింపు వేయిస్తున్నాం. రైతులు అందుబాటులో ఉండి తమ పశువులకు టీకాలు వేయించుకోవాలి. – డా.సురేష్, మండల పశువైద్యాధికారి, పాన్‌గల్

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

వనపర్తిరూరల్: ఉపాధ్యాయులు సమయ పాలన పాటిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన చేయాలని ఎంఈఓ జయరాములు అన్నారు. శనివారం మండలంలోని బునియాదిపురం ఎంపీపీఎస్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎల్‌ఎన్ రికార్డులు, ఎండీఎం రికార్డులు, విద్యార్థుల ప్రగతిని ఆయన పరిశీలించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగేషు, ఉపాధ్యాయులు దయానంద్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్‌లో అమడబాకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థి ఎస్.అజయ్‌ని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం

కొత్తకోట రూరల్: ఈనెల 23 నుంచి 25వరకు జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో అమడబాకుల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి ఎస్.అజయ్ ప్రతిభ కనబర్చి తృతీయ స్థానం సాధించాడు. అదే విధంగా ఈనెల 19న అడ్డాకుల మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి వాలీబాల్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని ఎం.నవనీత ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈనెల 28 నుంచి 30వరకు పెద్దపల్లి జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అండర్–17 వాలీబాల్ పోటీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పాల్గొంటారని పీఈటీ మధు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబర్చి తృతీయస్థానం సాధించిన ఎస్.అజయ్‌ని, రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన నవనీతలను శనివారం పాఠశాలలో ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్‌బాబు, ఉపాధ్యాయ బృందం ఆకుల వెంకటయ్య, లక్ష్మీదేవి, ధనుంజయ్‌గౌడ్, జమునరాణి, రమేష్ ఉన్నారు.

'ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి'



మదనాపురంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

మదనాపురం: ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొడ్డరెడ్డి, సూర చంద్రశేఖర్‌లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. శనివారం ఎంఆర్‌సీ భవనంలో మదనాపురం మండల విద్యాధికారిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న ఎంఈఓ కృష్ణయ్యను ఘనంగా సన్మానించారు. మరో ఇద్దరు ఉపాధ్యాయులను, 5 మంది కొత్త ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యా ధికారి షేక్ ఫారుక్ హుస్సేన్, టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, కాంప్లెక్స్, ప్రధాన ఉపాధ్యాయులు మద్దిలేటి, వెంకటేష్ నాయక్, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ రెడ్డి, కిరణ్, సావిత్రి, లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికడదాం



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న చైల్డ్‌వెల్ఫేర్ నిర్వహకులు విజయ్‌కుమార్

ఆత్మకూర్: బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరు కలిసికట్టుగా ముందుకు సాగాలని, దాని కోసం గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని అధికారులు తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో చైల్డ్ వెల్‌ఫేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ చాంద్‌పాషు, ఎంపీడీఓ సుజాత, ఎస్‌ఐ నరేందర్, చైల్డ్‌వెల్‌ఫేర్ నిర్వహకులు విజయ్‌కుమార్, ఎంఈఓ బాలరాజులు మాట్లాడారు. బాల్యవివాహాలను అరికట్టడంతో పాటు చిన్నారులపై లైంగిక వేధింపులు, డ్రగ్స్, చైల్డ్ లేబర్, బడిబయటపిల్లలు, ఫోక్సోచట్టం, తదితర విషయాలపై కులంకుశంగా చర్చించారు. గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి చిన్నారుల భవిష్యత్‌ను కాపాడాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, బాలల సంరక్షణ సమితి సభ్యులు నరేష్, రవిరాజు, ఆయా శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని, బాగా చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని ఎంఈఓలు బాలరాజు, భాస్కర్‌సింగ్‌లు అన్నారు. శనివారం మండలం లోని మోట్లంపల్లిలో హైదరాబాద్ ఉప్పల్ రోటరిక్లబ్ వారి ఆధ్వర్యంలో 117 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, ఇతరసామగ్రిని పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను ప్రైవేట్‌కు దీటుగా రాణించేందుకు సహకారం అందిస్తామని సంస్థ అధ్యక్షుడు రాజేష్ అన్నారు. ఇక్కడి విద్యార్థులందరికి త్వరలోనే షూస్, సాక్స్, ఇతర సామగ్రిని అందిస్తామన్నారు. ఈ సందర్భంగా రోటరి క్లబ్ నిర్వహకులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వీరన్న, జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, మహేష్‌జీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ధారాసింగ్

వీపనగండ్ల: యువకులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించినప్పుడు నిజ జీవితంలో ఉత్తమంగా రాణిస్తారని నియోజకవర్గ బీజేపీ నాయకులు ధారాసింగ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో దీపావళి, గంగమ్మ జాతర సందర్భంగా అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ క్రీడలకు ఆర్థిక సహాయం అందించిన మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు ముంత మల్లయ్యయాదవ్, ఎస్‌ఐ కే రాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బీరయ్యయాదవ్‌లు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మీసాల రాము, రైతు కమిటీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శివయాదవ్, గోపి నాయుడు, నాగరాజు, నాగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దర్మయుద్ధ మహాసభను జయప్రదం చేద్దాం

ఖిల్లాఘనపురం: ఎస్సీవర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగలకు ద్రోహం చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 30న నిర్వహించే మాదిగల ధర్మయుద్ధ మహాసభను జయప్రదం చేద్దామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గౌరిపాగ లక్ష్మయ్య పిలుపునిచ్చారు, శనివారం మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండానే ఉద్యోగాల భర్తీ చేయడం వల్ల ఎంతో మంది దళిత బిడ్డలకు అన్యాయం జరుగుతుందన్నారు. వర్గీకరణ చేపట్టకుండా కమిటీ పేరుతో కాలయాపన చేయాలని ముఖ్యమంత్రి చూస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి పదవి కాపాడుకోవడానికి మాదిగలకు అన్యాయం చేయడం తగదన్నారు. యువకులు, మహిళలు, ఉద్యోగులు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో పానుగంటి మల్లేష్, రాంచంద్రయ్య, రాములు, వెంకటయ్య, శ్రీను, సంజీవ, వెంకటయ్య పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



కొత్తకోట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కొత్తకోట రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం కొత్తకోట తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువుతున్న విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమౌతున్నారన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని, లేని పక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజవర్ధన్, భాను, భరత్, ఆఫ్రీద్, సాయి తదితరులు ఉన్నారు.

మూడు ఉద్యోగాలు సాధించిన ఓంకార్‌కు సన్మానం



ఓంకార్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వనపర్తిరూరల్: పెబ్బేర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ఓంకార్ మూడు ఉద్యోగాలు సాధించడంతో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వనం రాములు ఆధ్వర్యంలో శనివారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన కృష్ణయ్య, పద్మమ్మల మూడో సంతానం ఓంకార్ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి, తనకు ఇష్టమైన టీచర్ ఉద్యోగంలో చేరాడు. కార్యక్రమంలో వెంకటేష్, వీరస్వామి, సోషల్ మీడియా కన్వీనర్ వడ్డెరమేష్, మొగులన్న, మధు, యాదగిరి, మల్లికార్జున్, లక్ష్మణ్, గోకారి, మూర్తి, కొండల్, భీముడు, విష్ణు, శివ, లంకేష్ తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి పాలక మండలి సభ్యుడికి సన్మానం



బాదం వెంకటేశ్వర్లును సన్మానించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

కొత్తకోట రూరల్: కురుమూర్తి దేవస్థాన పాలక మండలి సభ్యుడిగా ఎన్నికై శనివారం ప్రమాణ స్వీకారం చేసిన పట్టణానికి చెందిన బాదం వెంకటేశ్వర్లును పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు మంచి గుర్తింపు లభించిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి నియోజకవర్గంలోని ఆర్యవైశ్యులు అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్య వైశ్య సంఘం నాయకులు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ కోశాధికారి విశ్వనాథం వెంకటరమణ, గుంత మల్లేష్, కొండ శ్రీనివాసులు, బచ్చు వెంకటరమణ, గుంత కిరణ్, కండె సురేష్, పల్లె శ్రీధర్, శ్రీనివాసులు, యాదగిరి, కన్నయ్య ఉన్నారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత



బీమా చెక్కును అందజేస్తున్న అధికారులు

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లికి చెందిన సగమోని కృష్ణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ వనపర్తి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ దిలీప్‌కుమార్‌రెడ్డి రూ.2.75లక్షల బీమా చెక్‌ను కృష్ణయ్య భార్య కాశమ్మకు అందజేశారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా కొద్దిపాటి ప్రీమియం చెల్లించిన బ్యాంకు నిబంధనల మేరకు వారి కుటుంబానికి ఆర్థిక భరోసా ఇచ్చేందుకు బీమా చెక్‌ను అందజేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అడ్వైజర్ చంద్రశేఖర్, బిజినెస్ మేనేజర్ వెంకట్‌రావు, మాజీ సర్పంచ్ మౌలాలి, శ్యాంసుందర్‌రెడ్డి, మోహన్‌గౌడ్, శ్రీనివాసులు, రాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'దాడికి పాల్పడడం సరికాదు'



అమరచింత మున్సిపల్ కారాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వార్డు ఆఫీసర్లు

అమరచింత: కొత్తకోట మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త పొగాకు విశ్వేశ్వర్‌పై వెంటనే చర్యలు తీసుకొని, కేసు నమోదు చేయాలని అమరచింత మున్సిపల్ వార్డు ఆఫీసర్లు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. కొత్తకోట మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వార్డు ఆఫీసర్ మామిండ్ల జయరాములుపై పరుశ పదజాలంతో దూషించడమే కాకుండా, దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. వివాదంలో ఉన్న ఫైల్‌పై వార్డు ఆఫీసర్ జయరాములును సంతకం చేయమని వేధించి, దాడికి పాల్పడడం సరికాదన్నారు. మున్సిపల్ వ్యవహారాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త పెత్తనం ఎక్కువైందని, దీంతో విధులు నిర్వహించడంలో ఇబ్బందులకు గురౌతున్నట్లు తెలిపారు. అనంతరం నల్లా బ్యాడ్జీలతో మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు మునిస్వామి, బాబు, లక్ష్మయ్యలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ చైర్‌పర్సన్ భర్తపై కేసు నమోదు

కొత్తకోట రూలర్: కొత్తకోట మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్ మామిళ్ళపల్లి జయరాములు విధులకు ఆటంకం కల్పించిన చైర్‌పర్సన్ భర్త పొగాకు విశ్వేశ్వర్‌పై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మంజునాథరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. మున్సిపాలిటీకి చెందిన భాస్కర్‌రెడ్డి ఇంటి మార్పిడి విషయమై పత్రాలు సరిగ్గా లేవని చెప్పినా వినకుండా జూనియర్ అసిస్టెంట్‌ను ఇబ్బంది పెట్టారని పేర్కొన్నారు. తన విధులకు ఆటంకం కలిగిస్తూ చెంపపై కొట్టి దాడి చేసినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

కొత్తకోట మున్సిపాలిటీ వార్డు ఆఫీసర్ జయరాములుపై చర్య తీసుకోవాలని కలెక్టర్‌కు కొత్తకోట మున్సిపాలిటీ కౌన్సిలర్లు రాములు యాదవ్, రామ్మోహన్ రెడ్డి, నాగన్న సాగర్, సంధ్యా రవీందర్‌రెడ్డి, ఖాజామైనొద్దీన్, వసీం ఖాన్, సుజా త, అద్వాని శ్రీను, సుల్తానా, వహీద్ అలీ, కో ఆప్షన్ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఇంటి మార్పిడి విషయమై చైర్‌పర్సన్ భర్త విశ్వేశ్వర్ వెళ్లి అడిగితే సీనియర్ సిటిజన్ అని గౌరవించకుండా ప్రవర్తించాడని పేర్కొన్నారు. తనపై దాడి చేయకున్నా తప్పుడు ఫిర్యాదు ఇచ్చి కేసు నమోదు చేయించాడని పేర్కొన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

దేశ సంపద పెరిగితే సామాన్యులకు లాభమేది



మాట్లాడుతున్న బాలనర్సింహ

వనపర్తి రూరల్: దేశ సంపద పెరిగితే సామాన్యులకు ఒరిగిందేమీ లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాలనరసింహ పేర్కొన్నారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సంపదను జనాభాతో లెక్కించి తలసరి ఆదాయం లెక్కిస్తారన్నారు. అంబానీకి, రిక్షా కార్మికుడికి ఒకటే తలసరి ఆదాయం వస్తుందని, దానివల్ల సామాన్యులకు ఒరిగేది లేదన్నారు. దేశంలో 80 కోట్ల మంది ఇంకా రేషన్ బియ్యం పైనే ఆధారపడుతున్నారని, పేదల బతుకులు మారలేదనటానికి ఇదే సూచిక అన్నారు. దేశం ఆకలి సూచిలో 108వ స్థానంలో ఉందని దేశంలో పేదరికం పెరిగిందనడానికి ఇది నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె విజయరాములు, శ్రీరామ్, రమేష్ ఉన్నారు.